# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్ది సేపటి క్రితం ఫ్రాన్స్ పర్యటన ముగించుకొని అమెరికాకు బయలుదేరారు.
- ❖ ప్రపంచ ఇంధన వినియోగంలో భారతదేశం వాటా 2050 నాటికి దాదాపు రెట్టింపు అవుతుందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేర్కొన్నారు.
- ❖ "మాఘ పూర్ణిమ" సందర్భంగా ఈరోజు మహాకుంభ మేళాలో కోటి 59 లక్షలకు పైగా భక్తులు పవిత్ర స్నానమాచరించారు.
- ❖ విద్యార్థులు తమ నియత్రణలో ఉండే విషయాలపైనే ఎక్కువగా ఆలోచించాలని ప్రముఖ సినీ నటి దీపికా పదుకొనే సూచించారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్ది సేపటి క్రితం ఫ్రాన్స్ పర్యటన ముగించుకొని అమెరికాకు బయలుదేరారు. అంతకముందు ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో కలిసి మార్సెయిల్‌లో నూతన భారత కాన్సులేట్ జనరల్‌ను ప్రారంభించారు. అనంతరం కాడరాచేలోని అంతర్జాతీయ థర్మో న్యూక్లియర్ ప్రయోగాత్మక రియాక్టర్ ను కూడా వారు ఇరువురు సందర్శించారు. ఇదిలా ఉండగా ఇరు దేశాల నాయకులు ఈ కాన్సులేట్ జనరల్‌ను ప్రారంభించడం భారత్ - ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో ఒక మైలురాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

====================

భారతదేశం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)లో అద్భుతమైన పురోగతి సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం భారత్ ఏఐ ని ఉపయోగిస్తోందని స్పష్టం చేశారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ సమాజాన్ని కోరారు. పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్‌లో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో సమావేశమైన అనంతరం సామాజిక మాధ్యమంలో ఈ విధంగా పేర్కొన్నారు. దీనికి బదులుగా

గూగుల్ సీఈఓ స్పందిస్తూ... ఏఐ భారతదేశానికి తీసుకువచ్చే అద్భుతమైన అవకాశాలను డిజిటల్ పరివర్తనపై కలిసి పని చేయగల మార్గాలను పారిస్ సమావేశంలో చర్చించామని సామాజిక మాధ్యమంలో తెలియజేశారు.

====================

ప్రపంచ ఇంధన వినియోగంలో భారతదేశం వాటా 2050 నాటికి దాదాపు రెట్టింపు అవుతుందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. ఈరోజు ఆయన "ఇండియా ఎనర్జీ వీక్ – 2025"లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రపంచ ఇంధన మార్కెట్లకు భారతదేశం కీలకంగా నిలుస్తుందని, ప్రపంచ జనాభాలో 17 శాతం జనాభాతో భారత్ 3వ అతిపెద్ద చమురు వినియోగదారునిగా ఉందని పేర్కొన్నారు. ఆదే విధంగా భారత్ - అమెరికా ఇంధన భాగస్వామ్యంపై హర్దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

"పరీక్ష పే చర్చ-2025"లో భాగంగా ఈరోజు మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన ప్రత్యేక సంచికలో సినీ నటి దీపికా పదుకొనే విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థులు తమ బలాలపై దృష్టి పెట్టాలని.. వైఫల్యాల గురించి ఎక్కువగా ఆలోచించి ఒత్తిడికి లోనవకూడదని చెప్పారు. విద్యార్థులు దృఢ నిశ్చయంతో సవాళ్లను ఎదుర్కోవాలని, ఏదైనా తప్పు జరిగితే భయపడకూడదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థులతో చేసిన సంభాషణను ఉటంకిస్తూ నటి మాట్లాడుతూ... విద్యార్థులు తమ భావాలను అణచివేయకుండా వ్యక్తపరచడం అలవాటు చేసుకోవాలన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలను కళంకంగా పరిగణించరాదని సూచించారు. మన నియంత్రణలో ఉండే విషయాలపైనే ఎక్కువగా ఆలోచించాలని దీపికా పదుకొనే మాట్లాడుతూ ...

(వాయిస్ 32 సెకన్లు)

====================

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాలో ఈరోజు "మాఘ పూర్ణిమ" సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల వరకు కోటి 59 లక్షలకు పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నాన మాచరించారని అధికారులు వెల్లడించారు. మాఘ పూర్ణిమ సమయంలో గంగా, యమున, సరస్వతి సంగమంలో స్నానం చేయడం శుభప్రదంగా భక్తులు భావిస్తుంటారు. కాగా ఇప్పటివరకు దాదాపు 47 కోట్ల 55 లక్షల మంది భక్తులు మహాకుంభ మేళాలో పవిత్ర స్నానమాచరించారు.

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ  ఫ్రాన్స్ పర్యటన విజయవంతంగా ముగిసిందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి తెలిపారు.  ఈ పర్యటనలో భాగంగా ఫ్రెంచ్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో జరిగిన చర్చల్లో యూరప్, పశ్చిమాసియా, ఇండో-పసిఫిక్‌లలో భౌగోళిక రాజకీయ పరిణామాలపై అభిప్రాయాలను పంచుకున్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ఫ్రాన్స్ పర్యటనపై మార్సెయిల్‌లో ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వైపాక్షిక చర్చల్లో ఒక ప్రధాన రంగంగా నిలిచిందన్నారు. వచ్చే సంవత్సరం ఇండియా - ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్‌గా పాటించాలని ఇరు పక్షాలు అంగీకరించాయని ఇది ఆవిష్కరణలు, అంకుర సంస్థలపై దృష్టి సారిస్తుందని విక్రమ్ మిస్రి మాట్లాడుతూ...

(వాయిస్ 41 సెకన్లు)

====================

ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా ఈరోజు ఆకాశవాణి న్యూఢిల్లీలోని పండిట్ రవిశంకర్ స్టూడియోలో రాగ్ రేడియో.. రంగ్ రేడియో.. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రీయ గాయకురాలు సీతా వసంత లక్ష్మి, నటుడు యోగేంద్ర టిక్కు, రేడియో జాకీ రీతు రాయ్, రచయిత డాక్టర్ సుభాష్ చంద్ర, ఆకాశవాణి మాజీ అదనపు డైరెక్టర్ జనరల్ యోగేంద్ర పాల్ సభ్యులుగా ప్యానెల్ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆకాశవాణితో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. రేడియోలో భాష ప్రాముఖ్యతను స్థిరమైన అభివృద్ధికి తోడ్పడటానికి డిజిటల్ రేడియో అవసరాన్ని ప్రస్తావించారు. అంతకుముందు ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రగ్యా పలివాల్ గౌర్ అతిథులకు స్వాగతం పలికారు.

====================

పశ్చిమ బెంగాల్ ఆర్థిక శాఖా మంత్రి చంద్రిమా భట్టాచార్య ఈరోజు ఆ రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ గణాంకాల ప్రకారం పశ్చిమ బెంగాల్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (GSDP) 18 లక్షల కోట్ల రూపాయలు దాటింది. బడ్జెట్‌లో రూపాయల రెవెన్యూ లోటు 35 వేల 314 కోట్ల రూపాయలుగా ఉంది. రహదారుల అభివృద్ధికి పథశ్రీ పథకం కింద 1,500 కోట్ల రూపాయలను ప్రతిపాదించగా 4.75 కిలోమీటర్ల పొడవైన గంగాసాగర్ వంతెనకు 500 కోట్ల రూపాయలను  కేటాయించారు.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు  ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

====================

భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య అహ్మదాబాద్ వేదికగా ఈరోజు జరిగిన వన్డే క్రికెట్ మ్యాచ్‌లో 142 పరుగుల తేడాతో భారత్ భారీ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 356 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.  భారత వైస్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ అత్యధికంగా 118 పరుగులు చేశాడు. అనంతరం లక్ష్య చేధనలో ఇంగ్లాండ్ జట్టు 214 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో మూడు మ్యాచ్ ల ఓడీఐ సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది.

====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలలో ముగిసాయి. సెన్సెక్స్ 76 వేల 293 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 122 పాయింట్ల నష్టంతో 76 వేల 171 వద్ద ముగిసింది. నిఫ్టీ 27.80 పాయింట్ల నష్టంతో 23 వేల 044 వద్ద స్థిరపడింది.

====================
====================